క్లుప్తంగా

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం



ఆయలం వద్ద రాట ముహూర్తంలో భక్తులు

కాకినాడ రూరల్: పిఠాపురం రోడ్డులో ఏపీఐ ఐసీ కాలనీని ఆనుకుని ఉన్న కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద దసరా ఉత్సవాలకు రాట ముహూర్తంను బుధవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. భక్తులు పందిరి రాటను వేసి, పూజలు నిర్వహించి, వేడుకలు నిర్విఘ్నంగా జరగాలని అమ్మవారిని కోరుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు వెంకటరమణ, మాజీ సర్పంచ్ రత్నప్రసాద్, బోళ్ల కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పద్య పఠనం పోటీలో ద్వితీయ స్థానం



ద్వితీయ బహుమతి అందుకుంటున్న కర్రి పవన్‌సాయి త్రినాథ్

బోట్‌క్లబ్: సంస్కార భారతి రాష్ట్ర శాఖ విశ్వనాథ సత్యనారాయణ జయంతిని పురస్కరించుకుని ఆంధ్ర సాహిత్య దినోత్సవాన్ని బుధవారం విజయవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథ సత్యనారాయణ రచించిన ఆంధ్ర పశస్తి కావ్యంలోని పద్యపఠనం పోటీలు రాష్ట్ర స్థాయిలో జరిగాయి. ఈ పోటీలో పాల్గొన్న కర్రి పవన్ సాయి త్రినాథ్ ద్వితీయ బహుమతి సాధించాడు. నగదు బహుమతి, జ్ఞాపిక ప్రశంసా పత్రాలను అదుకున్నారు. ఈ సందర్భంగా త్రినాథ్ ను సంస్కారభారతి జిల్లా అధ్యక్షుడు ఆకొండి శ్రీనివాస రాజారావు, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రముఖ పంచాంగకర్త డాక్టర్ సరిపెల్ల శ్రీరామ చంద్ర మూర్తి అభినందించారు.

'మా ఊరు వేళంగి' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన గ్రామ పెద్దలు, నాయకులు

కరప: స్థానిక వేళంగి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రచయిత, సామాజిక వేత్త సవిలే రాజేష్ రచించిన మా ఊరు వేళంగి పుస్తకాన్ని మెర్ల వీరయ్యచౌదరి, డాక్టర్ బొండా వెంకన్నారావు బుధవారం ఆవిష్కరించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన సర్పంచ్ సవిలే నీలిమకు మొదటి ప్రతిని అందించారు. బౌద్ధపరిశోధక రచయిత పిల్లి రాంబాబు పుస్తకం పై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులు పాకా చంద్రరావు, డాక్టర్ కె.భానుమతి, మాజీ సర్పంచ్ ముత్యాల శ్రీనుబాబు, టీడీపీ నాయకులు చంద్రు వెంకన్నారావు, బొడ్డు భాస్కర్ రామన్, వేళంగి గ్రామ ఉపసర్పంచ్ కుంచె సాంబమూర్తి, వేళంగి హైస్కూలు హెచ్ఎం.సూర్యనారాయణ మూర్తి, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ వాణి, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ అధికారుల ఫోన్ నెంబర్లు

మున్సిపల్ అధికారులు	
కమిషనర్	9100945696
అదనపు కమిషనర్	9849907096
డిప్యూటీ కమిషనర్	9949921555
ఏసీపీ	9989743049
ఎంహెచ్‌వో	9949432320
ఎస్ఈ	9959988639
మేనేజర్	7093519888
టీపీఆర్వో	9701385284
అకౌంట్ ఆఫీసర్	9849907084
సిటీ మిషన్ మేనేజర్	7901610084
పంచాయతీ అధికారుల ఫోన్ నెంబర్లు	
డివిజినల్ పంచాయతీ అధికారి	9849903188
ఫుడ్ ఇన్‌స్పెక్టర్	9494297564
ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ	9100121109
జిల్లా వ్యవసాయశాఖాధికారి	8331056483
దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్	9290145126
గృహ నిర్మాణశాఖ డీఈ	7093930577
పశుసంవర్ధకశాఖ జేడీ	9989932835
డీసీసీబీ జీయం	8341208227
జిల్లా సహకారశాఖ అధికారి	9100109168
జీజీహెచ్‌లో ముఖ్యమైన ఫోన్ నంబర్లు	
సూపరింటెండెంట్	98499 03870, 0884 2302001
సీఎస్ ఆర్ఎంవో	98499 03871
డీసీఎస్ ఆర్ఎంవో	98499 03871
ఆర్ఎంవో	0884 2302003
డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్	0884 2302002
అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)	98499 03873, 0884 2302004
పోలీస్ అవుట్‌పోస్ట్	83329 57924
అత్యవసర విభాగం	0884 2302021
బ్లడ్ బ్యాంక్	0884 2302009
మెడికల్ రికార్డ్స్ సెక్షన్ (ఎంఆర్‌డీ)	0884 2302018
కరప మండల అధికారుల ఫోన్‌నంబర్లు	
ఎంపీడీఓ	9346790319
తహసీల్దార్	9849903908
ఈఓ పీఆర్ ఆర్డీ	9849352293

అమ్మవారికి రక్షణ కరువాయె..

- ఆలయ ప్రహరీ కూల్చివేత
- సంవత్సరమైనా చర్యలు శూన్యం
- షాపింగ్ కాంప్లెక్స్ పడగొట్టడంతో ఆదాయానికి ఇబ్బంది
- 12 రోజుల్లో మొదలుకానున్న దసరా ఉత్సవాలు
- మండిపడుతున్న భక్తులు

బోట్‌క్లబ్: ఆలయాల్లో కోట్లాది రూపాయల విలువ చేసే అమ్మవారి విగ్రహాలకు, హుండీలకు రక్షణ లేకుండాపోయింది. పంతాలకు పట్టింపులకు పోయి ఆలయాలకు రక్షణ లేకుండా చేస్తున్నారు. స్థానిక సంత చెరువు కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ రక్షణ గోడ కూల్చివేశారు. గోడ కూల్చి సంవత్సరం అవుతున్నా ఇంతవరకూ కట్టించలేదు. ఆలయంలో అమ్మవారికి సుమారు 100 గ్రాముల బంగారు ఆభరణాలు, వంద కేజీల వెండి వస్తువులు ఉన్నాయి. వీటి విలువ సుమారుగా రూ.2.50 కోట్లు ఉంటుంది. నిత్యం వందలాది మంది భక్తులు వచ్చే ఆలయంలో నాలుగు హుండీలు కూడా ఉన్నాయి. నెలకు సుమారు రూ.20 నుంచి 30 వేల ఆదాయం కూడా వస్తుంది. ప్రస్తుతం ఆలయానికి రక్షణ గోడ లేకపోవడంతో వీటికి రక్షణ ఎలా అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. మరో 12 రోజుల్లో దసరా ఉత్సవాలు వస్తున్నాయి. ఈ ఆలయానికి వేలాది మంది భక్తులు తరలివస్తారు. దసరా ఉత్సవాల్లో అమ్మవారికి విలువైన బంగారం, వెండి వస్తువులు అలంకరిస్తారు. ఇటువంటి తరుణంలో రక్షణ గోడ లేకపోతే ఎలాగని భక్తులు మండిపడుతున్నారు. రాజకీయ కక్షలతో ఆలయ గోడ కూల్చి వేసి ఏడాది గడుస్తున్నా ఇంకా ప్రహరీ కట్టకపోవడమేంటని అడుగుతున్నారు.



ఆలయ రక్షణ గోడ కూల్చివేసి అడ్డంగా కట్టిన క్లాత్

వైఎస్సార్ సీపీ హయాంలో వైఎస్సార్ సీపీ నాయకుడు జొన్నాడ చినబాబు సంతచెరువు వద్ద అమ్మవారి ఆలయంలో రూ.25 లక్షలతో మూడు షాపులు, ఈఓ కార్యాలయం, భక్తులు కోసం మరుగుదొడ్లు కట్టించారు. షాపింగ్ కాంప్లెక్స్ ద్వారా నెలకు రూ.30 వేలు ఆదాయం కూడా వస్తోంది. ఆలయంలో పని చేసే సిబ్బంది, అర్చకులకు ఇబ్బంది ఉండేది కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత సెప్టెంబర్‌లో అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్, ఈఓ కార్యాలయం, మురగుదొడ్లను కక్షసాధింపు చర్యగా కార్పొరేషన్ అధికారులతో నేలమట్టం చేయించారు. తర్వాత దానిని పట్టించుకోవడం మానేశారు. దీంతో అప్పటి నుంచి ఆలయానికి ఆదాయం లేకపోవడంతో ప్రస్తుతం చాలా ఇబ్బంది పడుతున్నారు. ఆలయం ఎదురుగా కొబ్బరి కాయలు, అరటి పండ్లు విక్రయించేందుకు దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్న అక్కడ స్థానిక కూటమి నాయకులు అడ్డు తగులుతున్నారు. దీంతో ఆలయానికి ప్రస్తుతం ఆదాయం లేకుండా పోయింది. అక్కడ వేరే వ్యక్తి మాత్రం అనధికారికంగా ప్రస్తుతం కొబ్బరికాయలు, అరటి పండ్లు విక్రయిస్తున్నాడు. వారికి కూటమి నాయకులు అండ ఉండడంతో లీజు నిర్వహించేందుకు నాయకులు అడ్డు తగులుతున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..

కూటమి నాయకులు అమ్మవారి ఆలయం పక్కన ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ కూల్చివేయడంతో ప్రస్తుతం అక్కడ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. కూల్చివేసిన ప్రాంతాల్లో ఆటోలు నిలిపివేసి కొందరు ఆకతాయిలు మద్యం సేవిస్తున్నారు. దీనికి తోడు అమ్మవారి ఆలయానికి రక్షణ కూడా లేకుండా పోయింది. మరుగుదొడ్లు లేకపోవడంతో ఆలయానికి వచ్చే భక్తులకు అవస్థలు పడుతున్నారు.



సంతచెరువు కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం

త్వరలో రక్షణ గోడ నిర్మిస్తాం



ఆలయంలో రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకొంటున్నాం. త్వరలోనే పనులు కూడా ప్రారంభిస్తాం. అందుకు సన్నాహాలు చేస్తున్నాం. పనులు ప్రారంభించి వీలైనంత త్వరగా రక్షణ గోడ పూర్తి చేస్తాం.

– జోగా సత్యనారాయణ, ఈఓ, సంతచెరువు కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం

సంపత్ విజయ గణపతికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సంపత్ విజయ గణపతి

బోట్‌క్లబ్: స్థానిక దేవదాయ శాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న సంపత్ విజయ గణపతి ఆలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష పుష్పలంకరణ చేశారు. జిల్లా దేవదాయశాఖాధికారి కనపర్తి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్వామి ఆలయంలో భారీ అన్నదానం నిర్వహించారు. దేవదాయశాఖ డీసీ డీఎల్‌వీ రమేష్‌బాబు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 4 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.

విజయ గణపతి ఆలయంలో అన్నదానం

బోట్‌క్లబ్: స్థానిక టూటౌన్ బ్రిడ్జి కింద ఉన్న విజయగణపతి ఆలయంలో గణపతి నవరాత్రి ముగింపు ఉత్సవాల్లో భాగంగా బుధవారం భారీ అన్నదానం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు తలాటం హరీష్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అన్నదానం దాతలు చిట్టిపెద్ది రామ్‌కుమార్ , వైద్యులు కృష్ణమోహన్, సతీష్, రామకృష్ణ పాల్గొన్నారు.

కాకినాడ కస్టమ్స్ బ్రోకర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడిగా ఎన్నికైన సత్యనారాయణ

బోట్‌క్లబ్: కాకినాడ కస్టమ్స్ బ్రోకర్స్ అసోసియేషన్ 48వ వార్షిక జనరల్ బాడీ సమావేశం బుధవారం జరిగింది. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కమిటీ రెండు సంవత్సరాలు కొనసాగుతుంది. అధ్యక్షుడిగా అశోక ఇంటర్నేషనల్ అధినేత మండవ సత్యనారాయణ ఎన్నికయ్యారు. రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రల్ పూర్వ అధ్యక్షులుగా సేవలందించడమే అసోసియేషన్‌కి గత 17 సంవత్సరాలుగా అధ్యక్ష బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించి అందరి చేత మన్ననలు పొందిన మండవ సత్యనారాయణ తిరిగి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా శ్రీరామ్ భగవతి, ఉపాధ్యక్షులుగా ఏవీ చలం, సంయుక్త కార్యదర్శిగా ఆర్ శేషగిరిరావు, కోశాధికారిగా బి.రవి, కార్యవర్గ సభ్యులుగా సి.నరసింహారావు, మురళీకృష్ణ, రమణ, నగేష్, పీవీ రావు, కుమార్ ఎన్నికయ్యారు. కాకినాడ పోర్ట్ నుంచి జరిగే ఎగుమతులు, దిగుమతులు ఈ సంఘానికి చెందిన సభ్యుల ద్వారా నిర్వహిస్తారు. ఫెడరేషన్ ఆఫ్ ఫ్రైట్ ఫార్వర్డ్ అసోసియేషన్ ఇన్ ఇండియా జాతీయ సంఘానికి దేశవ్యాప్తంగా 31 సంఘాలతో ఎపెక్స్ బాడీతో పనిచేస్తుంది. దీనిలో కాకినాడ అసోసియేషన్‌కి చెందిన అధ్యక్షుడు మండవ సత్యనారాయణ, కార్యదర్శి శ్రీరామ భగవతి, ఉపాధ్యక్షుడు ఏవీ చలం కార్యవర్గ సభ్యులుగా జాతీయ కమిటీలో ఉన్నారు.

అర్హత ఉంటే ఆక్వా జోన్‌లోకి తీసుకురావాలి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జిల్లాలోని అర్హత ఉన్న ఆక్వా చెరువులన్నింటిని ఆక్వా జోన్ పరిధి కిందకు తీసుకువచ్చేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మత్స్యశాఖ అధికారులతో జిల్లాలోని ఆక్వా చెరువులు అనుమతులకు అనుసరిస్తున్న విధానం, జిల్లాలోని ఆక్వా జోన్ పరిధిలో ఉన్న చెరువులు వివరాలు వంటి అంశాలపై సమావేశం నిర్వహించారు. జిల్లాలో సుమారు 23 వేల ఎకరాల ఆక్వా చెరువులు విస్తరించి ఉండగా ఇప్పటివరకు 16 వేల ఎకరాల్లోని చెరువులను ఆక్వా జోన్ పరిధికి తీసుకువచ్చారన్నారు. మిగిలిన వాటిని కూడా ఆక్వా జోన్ పరిధి కిందికి తీసుకువచ్చేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఆక్వా జోన్ పరిధి కిందకు రైతులను తీసుకురావడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ రాయితీలు సదుపాయం ఆక్వా రైతులు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. గతంలో ఆక్వా జోన్ పరిధిలో ఉన్న సర్వే నంబర్లు ఎల్‌పీఎం కింద మారిపోవడంతో రైతులకు ఆక్వా అనుమతులు మంజూరు చేయడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు సర్వే, రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు సమన్వయంతో పని చేసి క్షేత్రస్థాయి పరిశీలన చేసి సంబంధిత వివరాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు, మత్స్యశాఖ ఏడీలు లావణ్య, కరుణాకర్ పాల్గొన్నారు.

కృష్ణకార్తిక్‌కు డాక్టరేట్



బాలాజీచెరువు: చేయ్యూరి కళాశాలలో పనిచేస్తున్న మందపల్లి కృష్ణకార్తిక్‌కు జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ డాక్టరేట్ అందజేసింది. ఫిజికోకెమికల్ హెవీ మెటల్ అండ్ ఫెస్టిఫైడ్ రెసిడ్యూ క్యారక్టరైజేషన్ ఆఫ్ గ్రౌండ్ వాటర్ నియర్ అగ్రికల్చర అండ్ ఆక్వాకల్చర్ ఏరియస్ ఫర్ క్వాలిటీ ఎవాల్యుయేషన్ అంశంపై సిద్ధాంత వ్యాసం రచించారు. జేఎన్‌టీయూ కాకినాడ కళాశాల కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సత్యవేణి, ప్రగతి కళాశాల కెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ పీవీఎస్ మాచిరాజు పర్యవేక్షణలో వ్యాసాన్ని సమర్పించారు. కృష్ణకార్తిక్ చేయ్యూరు శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో అసోషియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

ఉత్సాహంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ దినోత్సవం



మున్సిపల్ హైస్కూల్‌లో మొక్కలు నాటిన హెచ్‌ఎం, విద్యార్థులు

సామర్లకోట: స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షత వహించారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్‌తో సమానంగా స్కౌట్ అండ్ గైడ్ సర్టిఫికెట్‌కు విలువ ఉంటుందన్నారు. దీనిలో చేరిన విద్యార్థులకు క్రమ శిక్షణ అలవడుతుందని తెలిపారు. 1956 సెప్టెంబరు 10వ తేదీన కేంద్ర ప్రభుత్వం స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణా కేంద్రాన్ని స్థాపించారని సాయిరామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాఠశాల ఆవరణను శుభ్రం చేసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ అండ్ గైడ్స్ టీచరు పి.బ్రహ్మానందం, గైడ్స్ కెప్టెన్ పి.నిర్మల, విద్యార్థులు పాల్గొన్నారు.

రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

- సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య

కొత్తపల్లి: రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని రజకుల రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య డిమాండ్ చేశారు. స్థానిక ముప్పారపు అచ్చియమ్మ కల్యాణ మండపంలో బుధవారం రజకుల మండల మహాసభను వానపల్లి గంగాధర్ అధ్యక్షతన నిర్వహించారు. మండల కమిటీని ఎన్నుకున్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా సత్తెనపల్లి రామకృష్ణ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన భాస్కరయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం వాగ్దానాలు అమలు చేయాలి. 1940లో చిట్యాల ఐలమ్మ వెట్టి చాకిరి విముక్తిపై పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆ కారణంగానే సుమారు పది లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచడంలో చరిత్ర సృష్టించిందన్నారు. 2000 సంవత్సరంలో విద్యుత్ చార్జీలు తగ్గించాలనే ఉద్యమంలో ప్రాణాలర్పించిన సత్తెనపల్లి రామకృష్ణలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో భాగంగా 50 సంవత్సరాలు పూర్తయిన వారికి పించను, ఇస్త్రీ చేస్తున్న వత్తిదారులకు వారికి 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్తు చెరువులు దోబీ ఘాట్ స్థలాలపై రజకులకే పూర్తి హక్కు, పట్టణ మండల కేంద్రాలలో మోడరన్ ధోబీ గాట్లు ఏర్పాటు, రజక కార్పొరేషన్ ద్వారా 90శాతం సబ్సిడీ రుణాలు, ఆదరణ పథకంలో అధునాతన పరికరాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రజక సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షుడు కోనేటి రాజు మాట్లాడుతూ రజకుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేదంటే రానున్న రోజుల్లో రజకులు ఐక్యంగా పోరాటాలకు సిద్ధపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు గురాల అప్పారెడ్డి, కాళ్ల నాగేశ్వర రావు, మండల సంఘం అధ్యక్షుడు చోడవరపు బుజ్జి, వానపల్లి గంగాధర్, ముంగర్ల సత్తిబాబు, పి. బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వొకేషనల్ విద్యార్థులకు అప్రెంటిస్ అవకాశం




విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి శారద

బాలాజీచెరువు: ఒకేషనల్ విద్యను అభ్యసించిన విద్యార్థులకు అప్రెంటిస్ అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఐ.శారద పేర్కొన్నారు. ఇటీవల కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళాలో ఎంపికైన విద్యార్థులను మంగళవారం పీఆర్ కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ అప్రెంటిస్ ద్వారా భవిష్యత్‌లో మంచి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించవచ్చని, ఈఈటీ, ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఅండ్‌ఆర్ట్ అభ్యసించిన 300 మంది విద్యార్థుల్లో 250 మంది అప్రెంటిస్ సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నిరంజన్‌కుమార్, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ వితరణ

బాలాజీచెరువు: స్థానిక అన్నయ్య ఘాటీ సెంటర్ వద్ద ఉన్న గంటి మోహన్‌చంద్ర బాలయోగి(జీఎంసీ)నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలకు సౌండ్ సిస్టమ్, మైకులు అందజేశారు. పైండా నారాయణ, సుశీలమ్మ అకాడమీకు చెందిన పైండా శ్రీనివాస్‌లు మంగళవారం పాఠశాల యాజమాన్యానికి సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. ఈయనను విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు అభినందించారు.

మహిళలతోనే కుటుంబ సంక్షేమం



మహిళల కుట్టుశిక్షణ ప్రారంభిస్తున్న పోర్టు సభ్యులు

బోట్‌క్లబ్: మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే ఆ కుటుంబం సంక్షేమం బాగుంటుందని జేసీఐ కాకినాడ పోర్టు అధ్యక్షురాలు డాక్టర్ తన్మయి రామచంద్ర అన్నారు. జేసీఐ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ, మహిళలు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక హీరో షోరూంలో పని చేసే మహిళలు నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మహిళలకు డిజిటల్ మార్కెటింగ్‌పై 45 రోజుల శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సతీష్, అండాశ్, మోహన్ పాల్గొన్నారు.

సీతారామస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామ స్వామి ఆలయ నూతన కమిటీ సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్ ఆలయ కమిటీ చైర్మన్‌గా పులవర్తి విశ్వనాథం సభ్యులుగా సుబ్బలక్ష్మి, ఎం.వీరలక్ష్మి, తురగా సూర్యారావు, టి.ఎల్లమ్మ సీహెచ్ వీరబాబు, ఎం.సతీష్, పులవర్తి కుమార్, టీ నాగమణిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన సభ్యులను ఈ సందర్భంగా పలువురు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ పాల్గొన్నారు.

రేపు వివాదాస్పద స్థలం సర్వే

తాళ్లరేవు: సుంకరపాలెంలో వివాదాస్పద స్థలానికి సంబంధించి ఈ నెల 12న సంయుక్త సర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పి.త్రినాథరావు తెలిపారు. బుధవారం దీనికి సంబంధించి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇరువర్గాలతో తహసీల్దార్ త్రినాథరావు, ఎంపీడీఓ కె.సత్యనారాయణ, కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ చర్చలు జరిపారు. సర్వే నంబరు 123, 125లలో ఉన్న ప్రభుత్వ భూములకు సంబంధించి పంచాయతీ రాజ్, డ్రైనేజీ, రెవెన్యూ శాఖలతో సంయుక్తంగా సర్వే నిర్వహించి చర్యలు చేపడతామన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు

బాలాజీచెరువు: ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం వల్ల ఒకరి ప్రాణాలను కాపాడువచ్చని, రక్తదానం చేయడం అలవాటుగా మార్చుకోవాలని రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు పేర్కొన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం బుధవారం నిర్వహించారు. వైడీ రామారావు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఇతరుల ప్రాణాలు కాపాడడానికి అవసరమవుతుందన్నారు. రక్తదానం చేయడంలో ఆదిత్య విద్యాసంస్థలు ముందు ఉంటుందని, ఇటీవల విజయవాడలో అవార్డు అందజేశారన్నారు. అనంతరం రక్తదానం చేసిన విద్యార్థులకు ప్రసాంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ బీవీవీఎల్‌నాయుడు, పీవో తేజేశ్వరరావు పాల్గొన్నారు.

93వ సారి రక్తదానం

కరప: స్థానిక కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు 93వ సారి రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు. పేపకాయలపాలెం గ్రామస్తుడు గోవుందు రాజుకి అత్యవసరం గా లైవ్ బ్లడ్ 'ఓ పాజిటివ్' కావాలని, మాజీ సర్పంచ్ తాతీలును కోరగా ఆయన వెంటనే స్పందించిన రక్తదానం చేశారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మేడిశెట్టి మహిమను అభినందిస్తున్న సిబ్బంది



విద్యార్థి అబ్దుల్‌రజాక్‌ను అభినందిస్తున్న సిబ్బంది

బాలాజీచెరువు: ఇటీవల తిరుమలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 50వ యోగా పోటీల్లో కాకినాడకు చెందిన మేడిశెట్టి మహిమ 30–35 కేటగిరిలో ప్రతిభ చూపి సిల్వర్ మెడల్‌ను సాధించి ఈ ఏడాది డిసెంబర్‌లో రాంచీ, బీహార్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం రాక్‌యోగా స్పోర్ట్స్ అకాడమిలో డైరెక్టర్ డీఎస్ ప్రసాద్ అభినందన సభ ఏర్పాటు చేసి మాట్లాడుతూ నేటి కాలంలో యోగాకు ప్రాధాన్యత పెరిగిందని, క్రీడలతో సమానంలో విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని, ప్రభుత్వం వీరిని ఆర్థికంగా సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యోగా విద్యపీఠం రాష్ట్ర అధ్యక్షులు చిట్టూరి చిట్టిబాబు, యోగా ట్రైనర్ కల్పన, భారతి, అర్జునరావు, చంద్రిక పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో జేఎన్‌టీయూకే విద్యార్థి ప్రతిభ

జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాల కెమికల్ తృతీయ సంవత్సర విద్యార్థి షేక్ అమాన్ అబ్దుల్ రజాక్ క్రీడాపోటీల్లో ప్రతిభ చూపాడు. చెన్నైలో నిర్వహించిన సౌత్‌వెస్ట్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో 85 కేజీల విభాగంలో ప్రతిభ చూపి స్వర్ణపతకం సాధించాడు. స్పారింగ్ విభాగంలో స్వర్ణపతకం సాధించి ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా విద్యార్థి అబ్దుల్‌ను జేఎన్‌టీయూకే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్, స్టూడెంట్ ఎఫైర్స్ డైరెక్టర్ ఎ.కృష్ణమోహన్ అభినందించారు.

ఆటో డ్రైవర్ల పాదయాత్ర



సామర్లకోటలో శ్రీనుతో కలిసి ఆటో డ్రైవర్ల నిరసన

సామర్లకోట: ఫ్రీ బస్సు రద్దు చేయాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ స్త్రీ శక్తి మహిళలకు ఉచిత బస్సు రద్దు చేయాలని పాదయాత్ర చేస్తున్న ఆటో డ్రైవరు చింతకాయల శ్రీనుకు బుధవారం సామర్లకోటలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక గడియార స్తంభం వద్ద ఆటో డ్రైవర్లు ఫ్రీ బస్సు రద్దు చేసి, తమను ఆదుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పాదయాత్ర చేస్తున్న ఆటో డ్రైవరు చింతకాయల శ్రీను స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గత నెల 15వ తేదీన కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్ల జీవనోపాధి కోల్పోయాని, ఉచిత బస్సు లేని సమయంలో ఆటో డ్రైవర్లు రోజుకు రూ.1000 వరకు సంపాదించుకునేవారని, రూ.400 కూడా రావడంలేదని తెలిపారు. ఆటో డ్రైవర్లకు న్యాయం జరుగాలనే లక్ష్యంతో ఈనెల 9వ తేదీన విశాఖపట్నం నుంచి పాదయాత్ర ప్రారంభించామన్నారు. ఇలాగే అమరావతి వరకు చేరుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలు తీసుకువెళతానని చెప్పారు. ప్రతిగ్రామంలో ఆటో డ్రైవర్లు తనకు మద్దతు ఇస్తున్నారన్నారు. వెంటనే ఫ్రీ బస్సు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యాత్ర కాకినాడ నుంచి పాదయాత్ర ప్రారంభించి మాధవపట్నం, వీకే రాయపురం మీదుగా సామర్లకోట చేరుకున్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యను పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న సిరిపురపు శ్రీనివాస్

పెద్దాపురం: మున్సిపల్ కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డి.క్రాంతికుమార్, సిరిపురపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో బుధవారం వర్రే గిరిబాబు అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కార్మికుల విస్తృత సమావేశంలో వారు ప్రసంగించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్, శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపాలిటీ విస్తరణ పెరిగింది కానీ దానికి అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచకుండా వారిపై పనిభారం పెంచుతున్నారన్నారు. రాష్ట్రంలో స్వచ్ఛ సర్వేక్షణ పేరుతో ఇంటింటికీ చెత్త సేకరణ చేయాలని చెబుతున్న ప్రభుత్వానికి కార్మికులు ఎంతమంది ఉండాలో తెలియదా అని ప్రశ్నించారు. 29 వార్డుల్లో 42 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉన్న పెద్దాపురం పట్టణంలో 60 వేల మంది జనాభాకు కాంట్రాక్ట్ కార్మికులు 50 మంది మాత్రమే ఉన్నారన్నారు. మున్సిపల్ కమిషనర్ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. పదో తేదీ వచ్చినా కార్మికులకు జీతాలు ఇవ్వలేదన్నారు. తక్షణమే కార్మికుల జీతాలు విడదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శివకోటి అప్పారావు, రాజషే, సింహాచలం, కృష్ణ, దొండపాటి శేఖర్, భవాని, శకుంతల ,శేషారావు, సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.